

# జనం పవర్ జర్నలిస్ట్

MSME No. UDYAM-KM-02-0005137

నిజం వైపు, జనం కోసం

సంపుటి: 01 సంచిక : 07 సీఈవో: తుడుం పద్మావతి ఎడిటర్ : తుడుం జితేందర్ పేజీలు : 06 ఆదివారం 23-08-2026

## ఆ భవనాలన్నీ కూల్చేస్తాం

గచ్చిబౌలి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం రంగనాథ్

- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కూలిన భవనం
- ఏడంతస్తుల భవనం కూలి పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది

2

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్ లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ



## విద్య,పరిశోధనల్లో భాగస్వామ్యం

- కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి
- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ
- లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం

2

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

లండన్ లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య,పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్ ఫుల్ ఆసక్తి లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.



## యుద్ధానికి ముగింపు పలుకుదాం..

ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

- శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ద ముగించడం మేలని వ్యాఖ్య
- అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్
- కొనసాగుతున్న ప్రతిష్ఠంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్

2

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు : జస్టిస్ సంజయ్ కరోల్

- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

2



జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

'న్యాయమూర్తులు దేవుళ్లు కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు.'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం




## క్షమాపణ చెప్పాలి

- సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండ సుష్మిత విమర్శలు
- ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్న ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- క్రమశిక్షణా కమిటీ వారిపై సరైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి

2

## నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

వెలిగొండపై సీఎం చంద్రబాబు

- మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సిద్ధం
- ఆగస్టు 31న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం వెల్లడి
- కూటమి ప్రభుత్వం 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్ల పరిహారం చెల్లింపు
- గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం చంద్రబాబు విమర్శ
- ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షం

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత

2





2

## అసలు వ్యక్తులను గుర్తించాలి

ఆ అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలి: కొండా సురేఖ

## 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు

- సెప్టెంబర్ 5న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి
- అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉపాధ్యాయులు
- సెప్టెంబర్ 5న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి



2

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

పాఠశాల విద్య, అక్షరాస్యతకు చేసిన సేవలకు గుర్తింపుగా 48 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ అవార్డులు 2026ను ప్రకటించింది. అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత

## న్యాయ వ్యవస్థలే వెన్నెముక

- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక: సీజేఐ సూర్యకాంత్
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి

జనం పవర్ జర్నలిస్ట్,డెస్క్

స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు

2



# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

మొదటి పేజీ రువాయి

పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

**48 రోజుల్లోనే రూ.768 కోట్ల పరిహారం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

**గత ప్రభుత్వ డ్రామాలతోనే ఆలస్యం: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "1996లో నేనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు 2026లో నా చేతుల మీదుగానే ప్రారంభించడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి మొదటి దశ పనులు పూర్తి చేశాం" అని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నా, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీరు రాకపోయినా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు."వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021లోనే పూర్తి కావాల్సింది. కానీ గత పాలకుల డ్రామాల వల్ల ఆలస్యమైంది. వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా చిదిమేశారు. అయినా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం" అని విమర్శించారు.గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దేశంలో నీటి భద్రత సాధించవచ్చని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**పరిహారంపై నిర్వాసితుల హర్షం**

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను ఇబ్బందులు పెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుందని రైతు కాశిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ప్రారంభించడం సంతోషంగా ఉందని మరో నిర్వాసితుడు బోగెం శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం తమకు పూర్తి పరిహారం అందించి, కాలనీల్లో మంచి వసతులు కల్పించిందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు

# యుద్ధానికి ముగింపు పలుకుదాం..

మొదటి పేజీ రువాయి

"మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం" అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు.ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్ఠంభనలో కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది.జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యం

మొదటి పేజీ రువాయి

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి**

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

# క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ రువాయి

సీఎం రేవంత్?రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుష్మిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీశాయి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డికి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలపై శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ కూడా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి, కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఎలాంటి చర్యలకైనా పార్టీ సిద్ధం**

సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె క్షమాపణ చెప్పాలని విప్ విజయరమణారావు డిమాండ్ చేశారు. గౌరవనీయమైన పదవిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కుమార్తె మాట్లాడితే బాధ్యత ఉండదా అని ప్రశ్నించారు. కొండా సురేఖ వివరణతో పార్టీ సంతృప్తి చెందకపోతే ఎలాంటి చర్య తీసుకోవడానికైనా పార్టీ వెనుకాడదని హెచ్చరించారు.

**మా టీమ్ పై కుట్ర జరుగుతోంది**

కొండా సురేఖ ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. కొండా సురేఖ, రాజగోపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. 'కాంగ్రెస్ టీమ్ 66 మంది. మా టీమ్‌పై కుట్ర జరుగుతోంది, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మేము అండగా ఉన్నాం' అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి గద్దె దింపారని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రభుత్వ విప్ లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ఆపేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారన్నారు. కొండా సురేఖకు సొంత జిల్లా నాయకులతో కూడా సఖ్యత లేదని తెలిపారు.

# న్యాయ వ్యవస్థలే వెన్నెముక

మొదటి పేజీ రువాయి

మానవాళిలో

40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు.సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది' బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు.

# న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

మొదటి పేజీ రువాయి

చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం' అని జస్టిస్ కరోల్ తెలిపారు.

'కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం' దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

**'ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే'**

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. 'న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

# 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు

మొదటి పేజీ రువాయి

ప్రాంతాల ఉపాధ్యాయులతో పాటు కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితి, సైనిక్ పాఠశాలలు, ఆదర్శ గిరిజన పాఠశాలలు, పి.ఎం. శ్రీ పాఠశాలలు వంటి సంస్థలకు చెందిన వారు కూడా ఉన్నారు.2026 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 48 మంది పాఠశాల ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అలాగే, పురస్కారం అందుకున్న ప్రతి ఒక్కరి అద్భుతమైన కృషి, సేవలను తెలియజేసే లఘు డాక్యుమెంటరీలను కూడా ప్రదర్శిస్తారు. కాగా, ఎంపికైన వారిలో 26 మంది పురుషులు కాగా, 22 మంది మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, వారి సేవలను గౌరవించేందుకు ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్నారు.

**ఎవరెవరికి అవార్డులు వరించాయంటే!**

అవార్డు గ్రహీతల జాబితాలో గోవా నుంచి మహాదేవ్ హనమంత్ షిండే, గుజరాత్ నుంచి నితిన్ కుమార్ మహేంద్రకుమార్ పాఠక్, హరియాణా నుంచి అనిల్ కౌశిక్, హిమాచల్ ప్రదేశ్ నుంచి మంజరి వి. మహాజన్ ఎంపికయ్యారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన జాఫర్ ఆలమ్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. అలాగే, జమ్మూకశ్మీర్ నుంచి మహమ్మద్ అయాజ్ రైనా, మధ్యప్రదేశ్ నుంచి అర్చనా శుక్లా కూడా ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరితో పాటు మహారాష్ట్ర, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, లద్ధాఖ్ తదితర ప్రాంతాల నుంచి కూడా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈ ఏడాది అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్‌లో స్వీయ దరఖాస్తులను స్వీకరించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా జూన్ 15 నుంచి జులై 20 వరకు దరఖాస్తు ప్రక్రియ జరిగింది. వీటిని పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ మూడు దశల్లో పరిశీలించింది. ముందుగా జిల్లా స్థాయిలో, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో, చివరగా జాతీయ స్థాయిలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాల విద్య నాణ్యత మెరుగుదల, వినూత్న బోధనా పద్ధతులు, సమాజంపై ప్రభావం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తించి పురస్కారాలను బహుకరించనున్నారు.

**సేవలను జాతీయ స్థాయిలో గుర్తించి**

అయితే, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధాన ఉద్దేశం, దేశంలోని అత్యుత్తమ ఉపాధ్యాయుల ప్రత్యేక సేవలను గుర్తించి గౌరవించడం. అంతేకాదు, తమ నిబద్ధత, కృషి, అంకితభావంతో పాఠశాల విద్య నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను ఈ అవార్డులతో సత్కరిస్తారు. కాగా, ఉపాధ్యాయులు కేవలం పిల్లలకు పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, అలాంటి సేవలను జాతీయ స్థాయిలో గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశం. కాగా, ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌కాస్ట్ ప్లాట్‌ఫామ్‌తో పాటు, మంత్రిత్వ శాఖకు చెందిన సోషల్ మీడియా వేదికల్లోనూ ఇతర ప్రసార కార్యక్రమాల్లోనూ వీక్షించవచ్చు. మొత్తంగా 48 మంది అత్యుత్తమ ఉపాధ్యా అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.

# అసలు వ్యక్తులను గుర్తించాలి

మొదటి పేజీ రువాయి

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి తెలంగాణ మంత్రి కొండా సురేఖ శనివారం మరో లేఖ రాశారు. తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వెనుక ఉండి వ్యవహారాన్ని నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.క్రమశిక్షణా కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. విచారణ కొనసాగుతుండగానే తనపై బహిరంగ విమర్శలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, చర్యలు కోరడం వెనుక ఉద్దేశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా? పరిశీలించాలని సురేఖ కోరారు.సీనియర్ బీసీ మహిళా నాయకురాలిపై సామూహిక దాడులు జరుగుతున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు.






## నూతన కోర్టు భవనం ప్రారంభం

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 22 22**

ప్రతి ఒక్కరినీ గౌరవిద్దాం... సంతోషంగా జీవిద్దాం" అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మంచిర్యాల జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి–కమ్–జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, అహంకారం, చిన్నచిన్న విషయాలే అనేక గొడవలకు కారణమవుతున్నాయని అన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా కేసుల పరిష్కారంలో వాయిదాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో నూతన కోర్టు భవనాల ప్రారంభంతో కేసుల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, న్యాయమూర్తులు, న్యాయశాఖ అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉత్తమ తహశీల్దార్‌గా ఎంపికైన రోహిత్ దేశ్‌పాండేకి ఘన సన్మానం

**దండేపల్లి: జనం పవర్ జర్నలిస్ట్ (షేక్ సద్దాం హుస్సేన్ ) ఆగస్టు 22**

దండేపల్లి మండలంలో ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ, విశేష సేవలు అందిస్తున్న మండల తహశీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అరుదైన గౌరవం దక్కింది.?ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను గుర్తించి 'జిల్లా ఉత్తమ అధికారి' అవార్డుతో సత్కరించారు. ఈ అవార్డు రావడం పట్ల మండల ప్రజలతో పాటు పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ నేపథ్యంలో ఈరోజు దండేపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తహశీల్దార్ రోహిత్ దేశ్‌పాండే గారిని శాలువాలతో ఘనంగా సన్మానించి, పూలమాలలు వేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మండల ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ ,చీటి సత్యంరావు, నలిమెల అశోక్, అంబటిపెల్లి రవీందర్, బొమ్మెన మల్లేష్ తాళ్లపేట సర్పంచ్ ?కుర్సెంగ కళావతి, రాజగూడ జైనేని రాజవ్వ – భీమయ్య, ఉపసర్పంచ్ పూటపాక తిరుపతి, వార్డ్ సభ్యులు ముత్తె కుమారస్వామి, పత్తిపాక వినోద్ పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ

### సభ్యులుగా చిలకం మధుసూదన్ రెడ్డి ఎంపిక

**ధర్మవరం:- జనం పవర్ జర్నలిస్ట్**

స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పనకు కమిటీ నియామకమును జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వారు ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ధర్మవరం వాసి, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన చిలకం మధుసూదన్ రెడ్డికి స్థానిక సంస్థల సభ్యునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చిలక మధుసూదన్ రెడ్డి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమిటీ సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన అనుసరించాల్సిన విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ కమిటీ సభ్యునిగా చిలక మధుసూదన్ రెడ్డి ఎంపిక పెట్ల జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నీటిని పొదుపు చేద్దాం భవిష్యత్తు తరాలను కాపాడుకుందాం

### విద్యార్థులకు నీటి సంరక్షణ పై అవగాహన సదస్సు







**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 22,**

మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ లో ఎస్.ఎల్.ఏం(స్టూడెంట్ లీడ్ మూవ్మెంట్) కార్యక్రమంలో భాగంగా లీడ్ కోఆర్డినేటర్ పావని ఆధ్వర్యంలో నీటిని పొదుపు చేద్దాం భవిష్యత్ తరాలను కాపాడుదాం అనే సందేశంతో పాఠశాలలో విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, నీటి విలువను తెలుసుకోవడంతో పాటు, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, అవసరం లేని సమయంలో కుళాయి లను మూసివేయడం, లీకేజీ లను వెంటనే గుర్తించి సరిచేయడం, వర్షపు నీటిని సంరక్షించడం వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా త్రీడి ఆర్టిస్ట్ డి.శివరామ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరామ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరం నీటి ప్రతి చుక్క అమూల్యం నీటిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం. ఇంటి వద్ద, పాఠశాలలో, పరిసర ప్రాంతాల్లో నీటిని బాధ్యతగా వినియోగించాలని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ నీరు మన జీవనానికి ఆధారం. నీటి వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించడం ఎంతో అవసరం. నీటిని వృథా చేయకుండా, ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకులు అని, చిన్న వయసు నుంచే నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని. ఎస్ ఎల్ ఎం, కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నీటి పొదుపు పై అవగాహన కల్పించడం అభినందనీయం. విద్యార్థులు పాఠశాలలోనే కాకుండా తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో కూడా నీటి పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నాను. నీటిని కాపాడుదాం భవిష్యత్తును కాపాడుదాం అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేకాటపై పోలీసుల ఉక్కుపాదం..ఐదుగురికి బైండోవర్

**జన్నారం జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 22**

జన్నారం: మండలంలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సేవాదాస్‌నగర్‌లో చర్చి సమీపంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిందితులను జన్నారం తహసీల్దార్ బక్కయ్య ఎదుట హాజరుపరిచి బైండోవర్ ప్రక్రియ పూర్తి చేశారు. తహసీల్దార్ ఎదుట హాజరైన ఐదుగురు నిందితులను ఒక్కొక్కరిని రూ.లక్ష చొప్పున స్వంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. బైండోవర్ అయిన వారిలో సేవాదాస్‌నగర్‌కు చెందిన జాదవ్ నూర్‌సింగ్ (26), జాడి ప్రదీప్‌కుమార్ (22), దుర్గం అనిల్ (24), గాంధీనగర్‌కు చెందిన మొహమ్మద్ తబ్రేజ్ (22),



బోదసు నర్సింహ (23) ఉన్నారు. పేకాట, జూదం వంటి కార్యకలాపాలు కేవలం డబ్బు నష్టానికే కాకుండా కుటుంబ కలహాలు, సామాజిక సమస్యలకు కూడా దారితీసే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా పేకాట నిర్వహించడం, ఆడటానికి సహకరించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తమ పరిసరాల్లో పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని జన్నారం పోలీసులు కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్**

**తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 22,**



మంచిర్యాల జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, మంచిర్యాల మండలాల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అనామోలీస్ ను పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాల సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ణీత సమయంలోగా జారీ చేయాలని తెలిపారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ వ్యవహారాలను త్వరితగతిన పరిష్కరించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు రెవెన్యూ సంబంధిత పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసిల్దార్లు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు?

### జన్నారంలో ప్రజలను మోసం చేస్తున్నారనే ఆరోపణలు

**జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 22**

జన్నారం: మండలంలో ఓ రాజకీయ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అధికారులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. "నేను చెబితే మీ పని అయిపోతుంది.. మీరు వెళ్లండి" అంటూ ప్రజలను నమ్మించి డబ్బులు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విదేశాలకు వెళ్లే కుటుంబాలు, ఆస్పత్రులకు వచ్చే ప్రజలను లక్ష్యంగా చేసుకుని వారి ఫోన్ నంబర్లు సేకరించి పరిచయాలు పెంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా మహిళలను సైతం వ్యక్తిగత విషయాలతో బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వాస్తవాలు అధికారిక దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. కొందరితో అనైతిక సంబంధాల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా ఉండటంతో, బాధితులు తమ వద్ద ఉన్న ఫోన్ రికార్డులు, సందేశాలు, డబ్బుల లావాదేవీల ఆధారాలను అధికారులకు అందించాలని పలువురు కోరుతున్నారు. పార్టీ పేరు, అధికారుల పరిచయాలను అడ్డుపెట్టుకుని ప్రజలను మోసం చేస్తే సహించేది లేదని, ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జనం పవర్ దినపత్రిక ఈ వ్యవహారంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతోంది. ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు లేదా బెదిరింపులకు పాల్పడినట్లు ఆధారాలు బయటపడితే, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# అధికారుల సమాచార లోపం..

## ప్రెస్‌కు దూరంగా ప్రభుత్వ కార్యక్రమాల

**జనం పవర్ జర్నలిస్ట్ ఆగస్టు 22**

జన్నారం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార చర్యలు, అధికారిక సమావేశాలు, గ్రామస్థాయి కార్యక్రమాలు వంటి ప్రజలకు సంబంధించిన విషయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలి. అయితే మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది మీడియాకు ముందస్తు సమాచారం అందించకపోవడంపై స్థానిక పాత్రికేయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల పరిషత్, గ్రామపంచాయతీలు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, వైద్యారోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమ, అటవీ, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, పౌరసరఫరాలు, ఉపాధి హామీ తదితర శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు తరచూ జరుగుతున్నప్పటికీ, వాటికి సంబంధించిన ముందస్తు సమాచారం లేదా అధికారిక ప్రెస్‌నోట్లు మీడియాకు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరాలంటే వాటి వివరాలను ప్రజలకు తెలియజేయడం ఎంతో అవసరం. గ్రామస్థాయిలో ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తే సంబంధిత గ్రామస్థాయి అధికారి, మండలస్థాయి కార్యక్రమం జరిగితే సంబంధిత మండల అధికారి, జిల్లా స్థాయి కార్యక్రమం జరిగితే సంబంధిత జిల్లా అధికారి మీడియాకు సమయానుకూలంగా సమాచారం అందించడం ద్వారా ప్రజలకు పూర్తి వివరాలు చేరే అవకాశం ఉంటుంది. కానీ జన్నారం మండలంలో కార్యక్రమం పూర్తయిన తర్వాత కూడా మీడియాకు సమాచారం అందకపోవడం, ప్రెస్‌నోట్లు విడుదల చేయకపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని స్థానిక మీడియా ప్రతినిధులు







పేర్కొంటున్నారు. ప్రజాధనంతో, ప్రభుత్వ నిధులతో నిర్వహించే కార్యక్రమాలు ప్రజలకు తెలియకుండానే పరిమితం కావడం ఎంతవరకు సమంజసం? అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి, ఎక్కడ కార్యక్రమాలు జరుగుతున్నాయి, అధికారులు ఏ నిర్ణయాలు తీసుకుంటున్నారు, ప్రజా సమస్యలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు వంటి అంశాలు ప్రజలకు చేరాల్సిన అవసరం ఉంది. మీడియా ప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించడం వల్ల కార్యక్రమానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు సమగ్రంగా వివరించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రామీణ ప్రజలకు సంబంధించిన పథకాల విషయంలో సమాచారం ఆలస్యంగా అందితే అర్హులైన లబ్ధిదారులు అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. అధికారిక కార్యక్రమాల విషయంలో ప్రోటోకాల్, సమాచార పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం పాటించాల్సిన అవసరం ఉందని పాత్రికేయులు అంటున్నారు. ఏ శాఖలో ఏ కార్యక్రమం నిర్వహించినా సంబంధిత అధికారులు కనీసం ముందస్తు సమాచారం, కార్యక్రమ వివరాలు, అనంతరం అధికారిక ప్రెస్‌నోట్ అందించే విధానం అమలు చేయాలని కోరుతున్నారు. అధికారుల వ్యక్తిగత ప్రచారం కోసం కాకుండా ప్రజలకు ప్రభుత్వ సమాచారం చేరేందుకు మీడియాను సమాచార భాగస్వామిగా చూడాల్సిన అవసరం ఉందని స్థానిక పాత్రికేయులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు మీడియాను దూరంగా ఉంచడం వల్ల ప్రజలకు సమాచారం చేరడంలో లోటు ఏర్పడే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇకపై కూడా ఇదే పరిస్థితి కొనసాగితే జన్నారం మండలంలోని వివిధ శాఖల్లో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, అధికారిక నిర్ణయాలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందించడంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాల్సి వస్తుందని పాత్రికేయులు స్పష్టం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా శాఖాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి మండల స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు ముందస్తుగా అందించేలా తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్థానిక మీడియా ప్రతినిధులు కోరుతున్నారు. ప్రజలకు సంబంధించిన ప్రతి ప్రభుత్వ కార్యక్రమం ప్రజలకు తెలిసేలా సమాచార పారదర్శకత, అధికారుల జవాబుదారీతనం, మీడియా సమన్వయం తప్పనిసరిగా ఉండాలని వారు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వ పాఠశాల అవరణంలోకి నాగుపాము కలకలం

## భయందోళనకు గురైన విద్యార్థులు

**సిరికొండ, జనం పవర్ జర్నలిస్ట్(ఆగస్టు 22):**

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం చీమన్‌గుడి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి శనివారం నాగుపాము రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయంతో ఆందోళనకు గురయ్యారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో వర్షాకాలంలో పాములు, కీటకాలు, ఇతర జంతువులు తరచూ పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతకు ఇది ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని గ్రామ యువకుడు అవినాష్ ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, పొదలు ఉండటంతో పాటు ప్రహరీ గోడ లేకపోవడం వల్లే పాములు, ఇతర జంతువులు లోపలికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాలలో నాగుపాము కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన నెలకొంది. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాల చుట్టూ వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని, పాఠశాల పరిసరాలను పరిశు



భ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని



వారు విజ్ఞప్తి చేశారు.

## కుమార్తె మాటలను

# మంత్రిగా సురేఖ ఖండించాలి



మంత్రి కొండా సురేఖ ఇచ్చిన వివరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ క్రమశిక్షణ కమిటీలో ప్రధానంగా మూడు విషయాలపై సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు. కొండా సురేఖ ఇచ్చిన రీప్లై, కొండా సుస్మిత మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోలను పరిశీలించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని సాధారణ వ్యక్తిగా అనుచిత వాఖ్యలు చేశారని దీనిపై, కొంతమంది ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు ఇస్తామని చెప్పారన్నారు. అందరూ ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి స్పష్టం చేశారు. చర్యలు ఎప్పుడు తీసుకుంటామో ఇప్పుడే చెప్పలేమన్నారు. మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఇచ్చిన వివరణను కూడా పరిశీలించామన్నారు.

### పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు

కొండా సురేఖను గతంలో కాపాడానని, ఇప్పుడు అవకాశం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్‌దాటి నేరుగా సీఎంపైనే ఆరోపణలు చేశారని అనిరుద్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలు అంతగా హద్దులు దాటి మాట్లాడలేదన్నారు. వారు సీఎం గౌరవానికి భంగం కలిగించలేదన్నారు.

### టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి మంత్రి సురేఖ లేఖ

పీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి సురేఖ మరో లేఖ రాశారు. తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవిని కోరుతూ మంత్రి సురేఖ లేఖ రాశారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలని మంత్రి సురేఖ కోరారు. 'పార్టీ క్రమశిక్షణపై నాకు పూర్తి గౌరవం ఉంది. అదే సమయంలో, ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన నాపై తీవ్ర మాటలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నా రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మీడియా ముందుకు రావడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలి' అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.



# ధర్మవరం నియోజవర్గం బత్తలపల్లి

**బత్తలపల్లి:-జనం పవర్ జర్నలిస్ట్**

మండలం మాల్యవంతం పంచాయతీలో అనంతసాగరం గ్రామంలో శ్రావణ మరియు వరలక్ష్మి వ్రతం సందర్భంగా గ్రామ దేవత శ్రీ కొల్లాపూర్ మహాలక్ష్మి ఆలయంలో పూజ కార్యక్రమం చేయడం జరిగింది. మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన జరిగింది , పూజ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ నెంబర్లు పాల్గొనడం జరిగింది.



# 27న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మహా ధర్నా

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి ఆగస్టు 22,**

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 27న నస్పూర్‌లోని సమీకృత మంచిర్యాల జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(టిజిఈజేఏసి) మంచిర్యాల జిల్లా నాయకులు తెలిపారు. మహా ధర్నాకు అనుమతి కోరుతూ టిజిఈజేఏసి జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కే వనజా రెడ్డి లు శనివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల సహాయ పోలీసు కమిషనర్(ఏసిపి) ప్రకాష్ లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయం, జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగుల అభీష్టం మేరకు మహా ధర్నాను శాంతియుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, న్యాయమైన డిమాండ్లను త్వరగా పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యోగుల సమస్యలను ప్రతిబింబించే ఉద్యోగుల గొంతుక పత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్ దేశ్‌పాండే, అత్తె సుధాకర్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, శ్రవణ్‌కుమార్, గోపాల్ రాంకుమార్, తిరుపతి, నడిమెట్ల సత్యనారాయణ, ఎండీ యూసఫ్, రాజేందర్, వసంత్ లు పాల్గొన్నారు.




# దివ్యాంగులకు స్కూటీలు పంపిణీ

**జనం పవర్ జర్నలిస్ట్ వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆగస్టు 22,**

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి.నగేష్ ఉట్నూర్ లో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు కలసి దివ్యాంగుల సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్కూటీల పంపిణీ చేశారు. వారితో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు మాజీ రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ మరియు తదితరులు పాల్గొన్నారు.





# గిరిజన,సాంఘిక, దివ్యాంగుల సంక్షేమ శాఖల పై సమీక్ష సమావేశం

**జనం పవర్ జర్నలిస్టు వేల్పుల నగేష్ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి ఆగస్టు 22,**

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి. నగేష్ రాష్ట్ర మంత్రివర్యులు ఆడ్లూరు లక్ష్మణ్ అధ్యక్షతన గిరిజన సంక్షేమం సాంఘిక సంక్షేమం వికలాంగుల సంక్షేమ శాఖ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ఎం.పీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించడం లేదని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విట్టల్ ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బుజ్జి బోథ్ శాసనసభ్యులు జాదవ్ అనిల్ ఆసిఫాబాద్ కొమురం భీం శాసన సభ్యురాలు కోవా లక్ష్మీ జిల్లా కలెక్టర్లు ఐటిడిఎ/పి.ఓ జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన,ఎస్సీ,దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం







**ఆదిలాబాద్, జనం పవర్ డెస్క్(ఆగస్టు 22):**

గిరిజన, ఎస్సీ, దివ్యాంగుల సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పీఎంఆర్సీ కేబీ కాంప్లెక్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నిధుల వినియోగంలో జాప్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించడంతో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులను బలోపేతం చేస్తామని తెలిపారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత: నగేష్

గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఎంపీ జి. నగేశ్ కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా, నిర్దేశిత లక్ష్యాల మేరకు వినియోగించాలని సూచించారు. రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో బాత్రూమ్‌లు, మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కోరారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్సీ దండే విఠల్

గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాల కొరతను



పరిష్కరించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కోరారు. అటవీ శాఖ అనుమతుల కారణంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు త్వరితగతిన క్లియరెన్స్ వచ్చేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. పదో తరగతి అనంతరం గిరిజన విద్యార్థుల డ్రాపౌట్లను నివారించేందుకు మరిన్ని గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు.

### పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలోని 569 విద్యా సంస్థల్లో సుమారు 54 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, సోషల్ వెల్ఫేర్ శాఖ పరిధిలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ వేలాది మంది విద్యార్థులకు విద్య అందుతున్నట్లు వివరించారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థిని పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సంక్షేమ శాఖల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, కిట్ల పంపిణీ ప్రారంభించినట్లు చెప్పారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 26 మందికి సహాయక పరికరాలు అందించినట్లు వెల్లడించారు.

### ఐటీడీఏ పరిధిలో సమగ్ర అభివృద్ధి: పి.ఓ మంద మకరందు

ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు తెలిపారు. పీఎం–జన్మన్ పథకం కింద పీవీటీజీ ఆవాసాలకు మొబైల్ వైద్య సేవలు అందిస్తున్నామని, 13 అంబులెన్సులు, 102, 108 సేవలు, 186 సబ్ సెంటర్ల ద్వారా వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. 'విద్యా వీక్షణ' ఏఐ ఆధారిత వ్యవస్థతో విద్యార్థుల హాజరు, ఆహారం, హాస్టళ్ల నిర్వహణను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులైన గిరిజన రైతులకు 'ఇందిరా సౌరజల వికాసం' ద్వారా సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు విడతల్లో 26,352 మంది రైతులను గుర్తించినట్లు తెలిపారు.

### గిరిజన విద్యా సంస్థల బలోపేతానికి చర్యలు: ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం, విద్యా సంస్థలు, మౌలిక వసతులపై గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించి సమగ్ర నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి రోడ్లు, వంతెనల పనులకు సంబంధించిన టెండర్లు, అగ్రిమెంట్లను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, అటవీ అనుమతుల జాప్యాన్ని నివారించాలని కోరారు. అంతకుముందు కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహక నగదు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సంతోష్, గురుకులాల కార్యదర్శి సీతమహాలక్ష్మి, ఐటీడీఏ, సోషల్ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్, దివ్యాంగుల సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వకండి.. నిపుణుల హెచ్చరిక..

ఇటీవలి కాలంలో ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు వంటి విద్యుత్ ఆధారిత ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. యువత నుంచి డెలివరీ సిబ్బంది వరకు వీటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా పిల్లలు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడటం, మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ–బైక్‌ల వినియోగంపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పిల్లలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర విద్యుత్ వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో అధికారులు తల్లిదండ్రుల బాధ్యతపైనా దృష్టి సారిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పిల్లలు ఈ వాహనాలు నడపడానికి అనుమతించే తల్లిదండ్రులపై చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన నిబంధనలు లేకపోవడంతో తల్లిదండ్రులు, పిల్లలు ఏ వాహనం చట్టబద్ధమైనది, ఏది ప్రమాదకరమైనది అనే విషయంలో గందరగోళానికి గురవుతున్నారు.

**కనీస వయస్సు ఉండాలా..**

ఇటీవల ఓ టీనేజర్ చట్టవిరుద్ధమైన ఈ–వాహనంతో ప్రమాదానికి గురై మరణించడం ఈ అంశంపై మరోసారి చర్చకు దారితీసింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ–బైక్‌లను విక్రయిస్తున్న సంస్థలపైనా అధికారులు దృష్టి సారిస్తున్నారు. నిబంధనలకు మించి వేగం లేదా శక్తి కలిగిన ఈ–బైక్‌లను విక్రయిస్తే ఒక్కో విక్రయానికి భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ–బైక్ నడిపేవారికి కనీస వయస్సుతో పాటు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్నవారు అధిక వేగంతో ప్రయాణించే ఈ–బైక్‌లను నడపకుండా పరిమితులు విధిస్తున్నారు. వేగ పరిమితులు, హెల్మెట్ వినియోగం, వాహన సామర్థ్యానికి సంబంధించిన నిబంధనలు కూడా ప్రాంతాన్ని బట్టి మారుతున్నాయి. కొన్ని చోట్ల కొత్త నిబంధనలు తీసుకురాగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇలాంటి చర్యలపై చర్చ జరుగుతోంది.

**గణనీయంగా పెరుగుతున్న ప్రమాదాలు..**

ప్రమాదాలపై నిర్వహించిన పలు అధ్యయనాలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర మోటరైజ్డ్ వాహనాల వల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు వెల్లడించాయి. అయితే కేవలం ప్రమాదాల సంఖ్య పెరగడం కంటే గాయాల తీవ్రత, ముఖ్యంగా పిల్లల్లో తీవ్ర గాయాలు ఎక్కువగా నమోదవుతుండటం మరింత ఆందోళనకరమని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణ పెడల్ సైకిళ్లతో పోలిస్తే ఈ–బైక్‌ల ప్రమాదాల్లో గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. చిన్న వయస్సు వారు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం కూడా ప్రమాద తీవ్రతను పెంచుతున్న అంశాల్లో ఒకటిగా గుర్తించారు.

**అధిక శక్తి, వేగం ఉంటే..**

చాలా ప్రాంతాల్లో తక్కువ సామర్థ్యం కలిగిన ఈ–బైక్‌లను సాధారణ సైకిళ్ల మాదిరిగానే పరిగణిస్తారు. దీంతో కొన్ని సందర్భాల్లో లైసెన్స్, ఇన్సూరెన్స్ లేదా హెల్మెట్ తప్పనిసరి కావు. అయితే అధిక శక్తి, అధిక వేగం కలిగిన వాహనాల విషయంలో అనేక ప్రాంతాలు కనీస వయస్సు, హెల్మెట్ వినియోగం వంటి అదనపు నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు సమస్య అన్ని ఈ–బైక్‌లు కాదని సైక్లింగ్ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. తక్కువ శక్తితో, పెడల్ సహాయంతో నడిచే ఈ–బైక్‌లకు బదులుగా భారీ బాడీ, బలమైన టైర్లు, పెద్ద మోటార్లు కలిగిన విద్యుత్ మోటార్‌సైకిళ్లను కొన్నిసార్లు ఈ–బైక్‌ల పేరుతో విక్రయిస్తున్నారని వారు చెబుతున్నారు. ఇటువంటి వాహనాలే ఎక్కువ ప్రమాదకరంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు.

**ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలు..**

ట్రాఫిక్ సిగ్నళ్లను ఉల్లంఘించడం, ఫుట్‌పాత్‌లపై ప్రయాణించడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి ప్రమాదకర చర్యలు ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చట్టవిరుద్ధమేనని సైక్లింగ్ సంఘాలు చెబుతున్నాయి. కొత్త నిబంధనలు తీసుకురావడం కంటే ప్రస్తుతం ఉన్న చట్టాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. బాధ్యతాయుతంగా ఈ–బైక్‌లు ఉపయోగించే పిల్లల రాకపోకలపై అతిగా ఆంక్షలు విధించడం సరికాదని అంటున్నారు. అయితే పిల్లల భద్రత కోసం వయస్సు పరిమితులు అవసరమని కొందరు తల్లిదండ్రులు, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

**తల్లిదండ్రులు, తయారీదారులపై బాధ్యత..**

సమస్యను పరిష్కరించాలంటే తల్లిదండ్రుల బాధ్యతతోపాటు వాహనాల తయారీదారులు, విక్రయదారులపై కూడా బాధ్యత ఉండాలని వారు సూచిస్తున్నారు. పిల్లలకు ఈ–బైక్ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణ పద్ధతులపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని చెబుతున్నారు. పిల్లలు ఈ–బైక్‌లను ఉపయోగించే ముందు తల్లిదండ్రులు వాహనం గురించి పూర్తిగా తెలుసుకోవాలని, పిల్లలతో కలిసి ప్రయాణించి భద్రతా నియమాలను వివరించాలని నిపుణులు సూచిస్తున్నారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనం వేగాన్ని నియంత్రించడం వంటి జాగ్రత్తలను చిన్న వయస్సు నుంచే అలవాటు చేయాలని చెబుతున్నారు. పిల్లలు సరదాగా ఈ–బైక్‌లు నడపడంతో పాటు తమకు, ఇతరులకు ఎలాంటి ప్రమాదం కలగకుండా చూసుకోవడం తల్లిదండ్రులు, పిల్లలు, తయారీదారులు, ప్రభుత్వాలు అందరి బాధ్యతగా మా

# కానిస్టేబుల్ కొడుకు నుంచి మెగాస్టార్ స్థాయి..ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే

తెలుగు సినిమా చరిత్రలో మెగాస్టార్ చిరంజీవికి ప్రత్యేకమైన స్థానం ఉంది. హీరోగా ఆయన సాధించిన విజయాలు ఒక లెక్క అయితే ఆయన తర్వాత కుటుంబంలో సినిమా రంగంలోకి వచ్చిన వారి సంఖ్య మరో లెక్క. ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్స్‌గా కొనసాగుతున్నారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో స్టార్‌గా ఉంటూనే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాగబాబు, వరుణ్ తేజ్, సాయి దుర్గ తేజ్, వైష్ణవ్ తేజ్, నిహారిక ఇలా లిస్ట్ తీస్తే చాలా పెద్దదే ఉంటుంది. అయితే ఈ మెగా ప్రయాణంలో అత్యంత ఆసక్తికరమైన విషయం చిరంజీవి వచ్చిన బ్యాక్‌గ్రౌండ్. ఆగస్టు 22న ఆయన 71వ పుట్టినరోజు సందర్భంగా ఆ ప్రయాణం మరోసారి ఆసక్తికరంగా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే!



**ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే**

చిరంజీవి అసలు పేరు కొణిదెల శివశంకర వరప్రసాద్. ఆయన తండ్రి వెంకట్రావు పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. తల్లి అంజనా దేవి. కుటుంబంలో సినిమా ఇండస్ట్రీతో సంబంధాలు ఉన్నవారు ఎవరూ లేరు. కామర్స్ చదివిన చిరంజీవికి మాత్రం సినిమాలపై ఆసక్తి ఉండేది. అదే ఆసక్తితో 1970లో మద్రాస్ వెళ్లి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మొదట్లో హీరో పాత్రలే కావాలని ఎదురుచూడలేదు. విలన్, సపోర్టింగ్ రోల్స్ కూడా చేశారు. స్టార్ కొడుకు అనే ట్యాగ్ లేదు. వెనుక పెద్ద నిర్మాత కూడా లేరు. వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కారు.

**ఖైదీతో మారిపోయిన లెక్క**

1983లో వచ్చిన ఖైదీ చిరంజీవి కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా తర్వాత మాస్ ప్రేక్షకుల్లో ఆయనకు వచ్చిన క్రేజ్ మరో స్థాయికి వెళ్లింది. విజేత, స్వయంకృషి, జగదేకవీరుడు అతిలోకసుందరి, ఘరానా మొగుడు, హిట్లర్, ఇంద్ర, ఠాగూర్, శంకర్ దాదా వీదీదీ లాంటి సినిమాలతో దశాబ్దాల పాటు టాప్ హీరోగా కొనసాగారు. ముఖ్యంగా డ్యాన్స్‌ల విషయంలో చిరంజీవి అప్పటి తెలుగు సినిమాకు కొత్త స్టైల్ చూపించారు. యాక్షన్, కామెడీ, ఎమోషన్ అన్నింటినీ హ్యాండిల్ చేయగల స్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. సినిమాల ఫలితాలతో సంబంధం లేకుండా ఆయన కోసం థియేటర్లకు వచ్చే అభిమాన వర్గం కూడా భారీగా పెరిగింది. తర్వాత కాలంలో అదే అభిమాన బలం 'మెగా' అనే బ్రాండ్‌ను మరింత బలంగా మార్చింది.

**అల్లు కుటుంబంతో కలిసిన బంధం**

చిరంజీవి కెరీర్ ప్రారంభ దశలోనే 1980లో ప్రముఖ నటుడు అల్లు రామలింగయ్య కుమార్తె సురేఖను వివాహం చేసుకున్నారు. అప్పటికే అల్లు రామలింగయ్యకు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. సురేఖ సోదరుడు అల్లు అరవింద్ తర్వాత కాలంలో గీతా ఆర్ట్స్‌ను తెలుగు సినిమాల్లో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. దీంతో కొణిదెల, అల్లు కుటుంబాల మధ్య బంధం మరింత బలపడింది. ఒకవైపు చిరంజీవి స్టార్‌డమ్ పెరుగుతుంటే మరోవైపు నిర్మాణ రంగంలో అల్లు అరవింద్ తన స్థాయిని పెంచుకున్నారు. తర్వాతి తరానికి వచ్చేసరికి ఈ రెండు కుటుంబాలకు చెందిన చాలామంది సినిమా రంగంలో తమదైన గుర్తింపు తెచ్చుకున్నారు.

**కొడుకు గ్లోబల్ స్టార్- తమ్ముడు డిప్యూటీ సీఎం**

చిరంజీవి తనయుడు రామ్ చరణ్ 2007లో చిరుతతో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. మగధీరతో స్టార్‌గా మారిన ఆయన రంగస్థలం, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాలతో తన మార్కెట్‌ను భారీగా పెంచుకున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు దక్కింది. మరోవైపు చిరంజీవి తమ్ముడు పవన్ కల్యాణ్ ప్రత్యేకమైన అభిమాన బలాన్ని సంపాదించారు. తొలిప్రేమ, ఖుషి, గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది లాంటి సినిమాలు ఆయన క్రేజ్‌ను భారీగా పెంచాయి. తర్వాత జనసేన పార్టీని స్థాపించి రాజకీయాల్లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. మరో తమ్ముడు నాగబాబు నటుడిగా, రాజకీయ నాయకుడిగా కొనసాగుతుండగా కుమారుడు వరుణ్ తేజ్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. కుమార్తె నిహారిక నటన తర్వాత నిర్మాణంపై కూడా ఫోకస్ పెట్టారు.

## ప్రపంచ మాజీ బాక్సింగ్ ఛాంపియన్ జొలాని దారుణ హత్య

**డెస్క్:**

దక్షిణాఫ్రికాకు చెందిన ప్రపంచ మాజీ బాక్సింగ్ ఛాంపియన్ జొలాని టెటే(38) శనివారం దారుణ హత్యకు గురయ్యారు. ఈస్టర్న్ కేప్‌లోని ఆయన నివాసం వద్ద గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపినట్లు అధికారులు వెల్లడించారు. దక్షిణాఫ్రికా క్రీడలు, కళలు, సాంస్కృతిక శాఖ మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. జొలాని టెటే తన కారులో బయటకి వెళ్లి ఇంటికి చేరుకున్నాడు. గేటు తెరుచుకునే వరకు బయటే కారులో వేచి ఉన్నాడు. ఇంతలోనే ఇద్దరు గుర్తు తెలియని దుండగులు తుపాకీలతో కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ ఘటనలో జొలాని మరణించగా.. అదే కారులో ఉన్న ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రపంచ టైటిళ్ల నుంచి గిన్నిస్ రికార్డు వరకు..

జొలాని టెటే తన కెరీర్‌లో ఎన్నో కీలక విజయాలు అందుకున్నాడు. 2007-2008లో డబ్ల్యూబీఎఫ్ ప్రపంచ టైటిల్, 2017, 2019లో డబ్ల్యూబీఓ బాంటమ్‌వెయిట్ ప్రపంచ టైటిల్ గెలుచుకున్నాడు. 2017లో సిబోనిసో గోన్యాపై ప్రపంచ టైటిల్ పోరులో టెటే కేవలం 11 సెకన్లలోనే నాకౌట్ విజయం సాధించాడు. తొలి పంచ్‌తోనే ప్రత్యర్థిని పడగొట్టిన టెటే విజయం.. ప్రపంచ టైటిల్ పోరులో అత్యంత వేగవంతమైన నాకౌట్‌లలో ఒకటిగా నిలిచి గిన్నిస్ రికార్డులకెక్కింది. టెటే ప్రొఫెషనల్ కెరీర్‌లో 29 విజయాలు, 22 నాకౌట్లు, 4 ఓటములు, ఒక నో-కాంటెస్ట్ నమోదు చేశారు. 2022 జులైలో లండన్‌లోని వెంబ్లీ అరేనాలో జాసన్ కన్నింగ్‌హామ్‌పై సాధించిన విజయం ఆయన చివరి బౌట్‌గా నిలిచింది. డోపింగ్ వివాదం కారణంగా 4 సంవత్సరాల నిషేధం ఎదుర్కొన్న అతడు, ఆ నిషేధం ముగిసిన తర్వాత మళ్లీ రింగ్‌లోకి దిగడానికి సిద్ధమవుతున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది.

## కోహ్లీ కాదు సచినే గొప్ప.. ఆ దేశాల్లోనే అసలు సత్తా తెలుస్తుంది: ఆకాశ్ చోప్రా

**డెస్క్**

భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ మధ్య పోలిక మరోసారి చర్చనీయాంశంగా మారింది. సౌతాఫ్రికా మాజీ ప్లేయర్ ఏబీ డివిలియర్స్.. సీమింగ్ పరిస్థితుల్లో సచిన్ కంటే కోహ్లీనే గొప్ప అంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తన అభిప్రాయాన్ని చెప్పాడు. సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో ప్లేయర్ల గణాంకాలను పరిశీలిస్తే వారి అసలు సామర్థ్యం తెలుస్తుందని చోప్రా వెల్లడించాడు.'సేనా దేశాల్లోనే ప్లేయర్ల అసలు సత్తా తెలుస్తుంది. సచిన్ 63 మ్యాచ్‌ల్లో 5,387 పరుగులు చేశాడు. అతడి సగటు 51.30. 17 సెంచరీలు, 23 అర్ధసెంచరీలు ఉన్నాయి. కోహ్లీ 48 మ్యాచ్‌ల్లో 3,781 పరుగులు చేశాడు. అతడి సగటు 41.54. సెంచరీలను పక్కనపెట్టినా సగటులో గణనీయమైన తేడా ఉంది. అయితే దక్షిణాఫ్రికాలో మాత్రం కోహ్లీ సచిన్‌ను అధిగమించాడు. అక్కడ సచిన్ 15 టెస్టుల్లో 1,161 పరుగులు చేసి 46.44 సగటుతో కొనసాగగా.. ఐదు సెంచరీలు సాధించాడు. కోహ్లీ తొమ్మిది మ్యాచ్‌ల్లో 49.50 సగటుతో 2 సెంచరీలు, 4 అర్ధసెంచరీలు నమోదు చేశాడు. దక్షిణాఫ్రికా పిచ్‌పై బ్యాటింగ్ చేయడం సులువైన విషయం కాదు. అక్కడ అందరి సగటూ పడిపోతుంది. సచిన్ సగటు కూడా 46.44కి తగ్గింది. కానీ కోహ్లీ అక్కడ 49.50 సగటుతో సచిన్‌ను అధిగమించాడు. సచిన్‌పై కోహ్లీ పైచేయి సాధించిన ఏకైక దేశం ఇదే. కానీ మిగతా మూడు దేశాల్లో సచిన్‌దే ఆధిపత్యం. దీనిబట్టి నా అభిప్రాయం ప్రకారం.. సచినే గొప్ప' అని చోప్రా వివరించాడు.



# SPORTS

## పరాజయాలను పతనంగా చూడొద్దు..

### భారత టెస్టు క్రికెట్ గాడి తప్పలేదు: గంభీర్



**డెస్క్**

భారత టెస్టు క్రికెట్ గాడి తప్పలేదని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ఇటీవల ఎదురైన పరాజయాలను జట్టు పతనంగా చూడొద్దని తెలిపాడు. ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, వ్యూస్ తనకు పట్టవని.. ట్రోఫీలు గెలవడమే తన పని అని గంభీర్ వెల్లడించాడు. భారత్-శ్రీలంక రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబో వేదికగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో శనివారం గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. టీమిండియా ప్రదర్శనపై వస్తోన్న విమర్శల గురించి స్పందిస్తూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'నాకు ర్యాంకింగ్స్ ముఖ్యం కాదు. సోషల్ మీడియాలో వచ్చే లైక్స్, వ్యూస్, విమర్శలతో నాకు పని లేదు. మేం టెస్టుల్లో ఇబ్బంది పడుతున్నామనే వాదనలో అర్థం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత మేం మంచి క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను దాని గురించే ఆలోచిస్తా. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత జట్టులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. జట్టు ఇంకా పరివర్తన దశలోనే ఉంది. కొలంబో టెస్టులో తుది జట్టును ఎంపిక చేసేటప్పుడు 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తాం. కుల్‌దీప్ యాదవ్ మంచి బౌలర్. అయితే కొన్ని సందర్భాల్లో నిర్ణయం కెప్టెన్‌పైనా ఆధారపడి ఉంటుంది. ఒకటి, రెండు మ్యాచ్‌ల ఆధారంగా ఆటగాళ్లపై వేటు వేసేలా నిర్ణయం తీసుకునే ఉద్దేశం లేదు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజం.. యువ ఆటగాళ్లకు తగినంత సమయం ఇచ్చి అండగా నిలవాల్సిన అవసరం ఉంది' అని గంభీర్ వివరించాడు.

**మూడు టెస్టుల సిరీస్ కావాలి!**

శ్రీలంకతో ప్రస్తుతం రెండు టెస్టుల సిరీస్ జరుగుతున్నప్పటికీ.. భవిష్యత్తులో మూడు టెస్టుల సిరీస్‌లే మెరుగైనవని గంభీర్ అభిప్రాయపడ్డాడు. 'మూడు టెస్టుల సిరీస్ అనేది ఆదర్శవంతమైనది. మ్యాచ్‌ల మధ్య తక్కువ సమయం ఉన్నా శరీరాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలో మాకు తెలుసు. అవసరమైతే బౌలర్లకు విశ్రాంతి ఇస్తాం. ఒక జట్టు తొలి టెస్టులో ఓడిపోతే.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో తిరిగి పుంజుకునే అవకాశం ఉంటుంది. గాలే పిచ్‌పై సంతృప్తికరంగా అనిపించింది. కొలంబోలోనూ మంచి టెస్టు వికెట్ లభిస్తుందని ఆశిస్తున్నాం' అని గంభీర్ వెల్లడించాడు.


Published and Owned by... CEO: Tudum Padmavathi, Editor: Tudum Jeetender, Registration No. UDYAM-KR-02-0005137: Published at: Kawal, Jannaram, Mancherial - 504 205, Phone No: +91 8500 789 798: website : www. Janmpowerjournalist.online